క్లుప్తంగా

మంత్రిప్రగడ సత్రానికి ఫ్యాన్‌ల బహూకరణ



దాతలను సత్కరిస్తున్న బంగారు చినశోభనాద్రి సత్రం ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి

బోట్‌క్లబ్: స్థానిక పెదమార్కెట్‌లో ఉన్న బంగారు చినశోభనాద్రి సత్రానికి కాకినాడకు చెందిన రిటైర్డు లెక్చరర్లు ఉప్పులూరి మురళి, స్వరాజ్య లక్ష్మి దంపతులు రెండు ఫ్యాన్‌లు సోమవారం అందించారు. దాతలను సత్రం ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి సత్కరించారు. ఇక్కడ విద్యార్థులు మధ్యాహ్నం, రాత్రి ఉచిత భోజనం అందిస్తున్నామని విద్యార్థులు భోజనం చేసే సమయంలో ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న మురళి దంపతులు ఫ్యాన్లు అందించారన్నారు. కార్యక్రమంలో సత్రం సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

దివ్యాంగుల హక్కులను పరిరక్షించాలి



జిల్లా అధికారులకు వినతిపత్రం ఇస్తున్న జి.కొండలరావు, ఎస్.గుర్రయ్య తదితరులు

బోట్‌క్లబ్: ఎన్టీఆర్ పింఛన్ భరోసా ప్రభుత్వ పింఛన్ పథకంలో లబ్ధి పొందుతున్న దివ్యాంగులను పునఃపరిశీలించి తనిఖీ ప్రక్రియలో ఉన్న లోపాలను పరిశీలించి సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకొని, దివ్యాంగుల హక్కులను పరిరక్షించగలరని కోరుతూ దివ్యాంగుల సంఘాలు సంయుక్తంగా కలెక్టర్ షణ్మోహన్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. వివిధ రకాల వైకల్యాలు 21 ఉన్నాయన్నారు. వైకల్య శాతాలను పరిశీలించి, నిర్ధారించేందుకు తప్పనిసరిగా సైంటిఫిక్ యంత్రాలను కలిగిన నిపుణులైన టెక్నీషియన్లను, వైద్యులను ఉపయోగించి, అంగ వైకల్య ధ్రువీకరణ పత్రాల మంజూరు కార్యక్రమాన్ని 2010లో ప్రారంభించిందన్నారు. సదరం ఆన్‌లైన్ ధ్రువీకరణ పత్రాల మంజూరుకై ఇచ్చిన ధ్రువీకరణ పత్రాలల్లో కచ్చితంగా దివ్యాంగుల వైకల్య శాతాలను గుర్తించేందుకు టెస్టింగ్ మెషీన్లు బధిరులకు, ఫీల్డ్ విజన్ 21 రకాల దివ్యాంగుల వైకల్య శాతాలను గుర్తించడానికి యంత్ర పరికరాలు లేకుండానే జిల్లా స్థాయి మెడికల్ బోర్డులో దివ్యాంగులను పరిశీలించి అనేక సంవత్సరాలుగా సదరం సర్టిఫికెట్లు జారీ చేయడం జరిగిందని పలువురు దివ్యాంగులు వివరించారు. అధికారులు చేస్తున్న తనిఖీలను పునః పరిశీలించి తొలగించిన పింఛన్లు పునరుద్ధరించి దివ్యాంగులకు పూర్తి స్థాయిలో పింఛన్లు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం జేఏసీ నాయకులు జి.కొండల రావు, వైఎస్సార్ సీపీ దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్.గుర్రయ్య, ఎం.రాజు, పి.లోవరాజు, ఆర్.నాగేశ్వరరావు, పీజీ రాజు, ఎం.రాజు, తదితరులు పాల్గొన్నారు.

మరిడమ్మ ఆలయ హుండీల ఆదాయం లెక్కింపు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ ఆలయానికి హుండీల ద్వారా 34 రోజులకు రూ.13,98,965 ఆదాయం సమకూరినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి తెలిపారు. జాతర ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయ ట్రస్టీ చింతపల్లి శ్రీహర్ష, ఈఓ పళ్లంరాజు సమక్షంలో హుండీలను లెక్కించారు.

తెలుగు భాష గుర్తింపునకు జాతీయ స్థాయిలో కృషి



తెలుగుభాష సాహిత్య ఉత్సవాల్లో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు సతీష్‌బాబు

బాలాజీచెరువు: తెలుగు భాష గుర్తింపునకు జాతీయ స్థాయిలో కృషి చేస్తానని రాజ్యసభ సభ్యులు సానా సతీష్‌బాబు పేర్కొన్నారు. ఐడియల్ డిగ్రీ కళాశాలలో వారం రోజుల పాటు నిర్వహించే తెలుగుభాష సాహిత్య ఉత్సవాలను సోమవారం జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఎంపీ సతీష్‌బాబు మాట్లాడుతూ విద్యార్థుల్లో తెలుగుభాష స్ఫూర్తిని నింపేందుకు, సాహిత్య సృజనతలో ఆసక్తి కోసం చిరంజీవిని కుమారి భాషా సాహిత్య ఉత్సవ వేదిక వారు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ప్రముఖ అవధాని, ఆస్వాదన సాహిత్య సంస్థ అధ్యక్షుడు గొట్టుముక్కల వెంకటసత్యనరసింహశాస్త్రి తెలుగు ఉపాధ్యాయులను ఉద్దేశించి ప్రసంగించారు. తొలిరోజు భాగంగా 50 పాఠశాలలు, 11 కళాశాలల నుంచి 320మంది విద్యార్థులు పాల్గొనగా విద్యార్థులకు పోటీలు నిర్వహించి, 40 మంది తెలుగు ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ కిరణ్, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, డైరెక్టర్ రంజిత్, కేవీఎస్ వాసు, కామరజు, సలాది సాయిసత్యనారాయణ, కె.ఆదినారాయణమూర్తి, మార్ని జానకీరామయ్యచౌదరి పాల్గొన్నారు.

తొలిపూజకు వేళాయె..

- కొలువుదీరేందుకు గణనాథుడు సిద్ధం
- మండపాల ఏర్పాట్లలో యువకులు, ఉత్సవ కమిటీల నిమగ్నం
- పెద్ద విగ్రహాలకు పెరిగిన డిమాండ్
- జోరుగా వినాయక ప్రతిమల విక్రయాలు



వినాయక మండపంలో కొలువుదీరేందుకు సర్పవరం జంక్షన్ వద్ద తుది మెరుగులు దిద్దుకుంటున్న వినాయక విగ్రహం



సర్పవరం జంక్షన్ వద్ద మట్టి విగ్రహాల కొనుగోలు

కాకినాడ రూరల్: ప్రథమ పూజ్యుడు, గణనాయకుడు, వక్రతుండ వినాయకుడు, లంబోదరుడు, పార్వతీ తనయుడు, విఘ్ననాశకుడు, విఘ్నేశ్వరుడు.. ఇలా భక్తులతో పిలుపులందుకునే గణనాథుడి చవితి పూజకు వేళయింది. మార్కెట్‌కు వినాయక చవితి కళ వచ్చింది. గ్రామాలు, నగరంలో వీధి వీధినా వినాయక మండపాల ఏర్పాటులో యువకులు, ఉత్సవ కమిటీలు పోటీ పడుతున్నారు. బుధవారం వినాయక చవితి పండగను పురస్కరించుకుని గణనాథుడిని తమ భక్తి కొలది కొలిచేందుకు భక్తులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. మండపాలలో భారీ వినాయక విగ్రహాల ఏర్పాటుకు ముందుగానే అడ్వాన్సులు చెల్లించిన వారు విగ్రహాలను ట్రాక్టర్లు, ఇతర వాహనాలపై మండపాలకు తరలిస్తున్నారు. సర్పవరం జంక్షన్ నుంచి సర్పవరం గ్రామం వరకు వెళ్లే మార్గంలో సుభానికేతన్ సమీపాన మూడు చోట్ల రాజస్థాన్ నుంచి వచ్చి స్థిరపడిన వారు వినాయక విగ్రహాలను వివిధ రూపాల్లో సిద్ధం చేశారు. గత ఏడాది కంటే ఎక్కువగా విగ్రహాల అమ్మకాలు జరుగుతుండడంతో ఏడాది పాటు పడిన కష్టాన్ని మరచిపోయి ఉత్సాహంగా అమ్మకాలు సాగిస్తున్నారు. చిన్న చిన్న విగ్రహాలు మొదలుకొని రూ.30 వేలకు పైబడిన ధరలో విగ్రహాలను విక్రయిస్తున్నారు. సర్పవరంలో జంక్షన్‌లో షోలాపూర్ నుంచి తీసుకువచ్చిన మట్టి వినాయక విగ్రహాల అమ్మకాలు సాగిస్తున్నారు.

పత్రి, పువ్వులు, టెంకాయలు సిద్ధం

వినాయక చవితి పండగను ప్రతి ఒక్కరూ తమ ఇండ్లతో పాటు వ్యాపార, వాణిజ్య ప్రాంతాల్లో ఎంతో ఘనంగా జరుపుకొని ఏ కార్యం తలపెట్టిన నిర్విఘ్నంగా జరగాలని కోరుకుంటారు. విద్యార్థులు తమ చదువులు బాగా కొనసాగాలని కోరుకుంటారు. బుధవారం చవితి కోసం మార్కెట్‌లో పత్రి, పండ్లు, మొక్కజొన్న పొత్తులు, గరిక, పువ్వులు, టెంకాయలు, అరటి పండ్లను అందుబాటులో ఉంచారు.

180 విగ్రహాలు తయారు చేశాం



ఏడాది పాటు కష్టపడి 180 వినాయక విగ్రహాలు తయారు చేశాం. ఇప్పటికి 70కి పైగా అమ్మకాలు పూర్తయ్యాయి. చిన్న సైజు విగ్రహాల నుంచి అన్ని రకాలు అందుబాటులో ఉంచాం. ఏడేళ్లుగా విగ్రహాలు తయారీలో ఉన్నాం. గతేడాది కంటే ఈ ఏడాది అమ్మకాలు బాగున్నాయి.

– లక్ష్మీకుమారి, వినాయక విగ్రహాల తయారీదారు, రాజస్థాన్

మట్టి విగ్రహాలు బాగా కొంటున్నారు



మట్టి వినాయక విగ్రహాల వినియోగం బాగా పెరిగింది. చిన్న సైజులో మట్టి వినాయక విగ్రహాలకు డిమాండ్ ఉండడంతో సోలాపూర్ నుంచి తీసుకు వచ్చి అమ్ముతున్నాం. ప్రజలు ప్లాస్టర్ ఆఫ్ పారిస్(పీఓపీ) కంటే మట్టి ప్రతిమల కొనుగోలుకు ఆసక్తి చూపిస్తున్నారు.

– ఎస్.భాను, సర్పవరం జంక్షన్, రమణయ్యపేట

ప్రమాదకరంగా మలుపు



రామారావుపేటలో శివాలయం ఎదురుగా ప్రమాదకరంగా ఉన్న మలుపు

కాకినాడ లీగల్: రామారావుపేటలో శివాలయం ఎదురుగా ఉన్న మలుపు రోడ్డు గొయ్యితో పాటు, డ్రైనేజీ పై శ్లాబ్ రాళ్లు విరిగిపోయి అటుగా ప్రయాణించే వారికి ముప్పు పొంచి ఉంది. ఆదమరచి ప్రయాణిస్తే వారి సంగతులు అంతే. దీంతో ఆ మలుపు రోడ్డులో గొయ్యి ప్రమాదాలకు నిలయంగా మారింది. రామారావుపేట నుంచి కొండయ్యపాలెం వంతెన ప్రారంభమైంది. దీంతో ఆ రోడ్డులో నిత్యం వేల సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. వంతెన నుంచి శివాలయానికి వెళ్లే మలుపు రోడ్డులో కొంతకాలం రోడ్డు గొయ్యితో డ్రైనేజీ పై శ్లాబ్ రాళ్లు విరిగిపోయి ఉన్నాయి. ఆ గోతిలో వర్షం వస్తే నీరు చేరుతుంది. దీని వల్ల రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఆదమరిచి ఆ గోతిలో ప్రమాదవశాత్తూ వాహనదారులు పడి గాయాలతో ఆస్పత్రుల పాలవుతున్నారు. దీనిపై సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుపక్కనే మద్యం బాబుల హల్‌చల్

- అటుగా ప్రయాణించాలంటే భయం.. భయం
- కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసిన ప్రజలు



జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్ బెజవాడ వీరవెంకట సత్యనారాయణ



పట్టపగలు టీటీడీ కల్యాణ మండపం వెనుక వీధిలో ఆటోలో మద్యం తాగుతున్న మందుబాబులు



కలెక్టర్‌కు అందించిన వినతిపత్రం చూపుతున్న టీటీడీ కల్యాణ మండపం వెనుక వీధి ప్రజలు

బోట్‌క్లబ్: నిత్యం వందలాది మంది ప్రయాణించే చోట మద్యం బాబుల గలాటా ఓ పక్క, అనధికారికంగా ఏర్పాటు చేసిన బడ్డీ కొట్లు కారణంగా ఈ ప్రాంత ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. స్థానిక బాలాజీ చెరువు సెంటర్, టీటీడీ కల్యాణ మండపం పక్క సందులో, దుగ్గిరాల వారి వీధి, గాడేపల్లి వారి వీధిలో వేళా పాళా లేకుండా రోడ్డు పక్కనే మద్యం తాగుతుండడంతో ఆ ప్రాంత ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. నిత్యం వందలాది మంది తిరిగే ప్రాంతంలో ప్రయాణించాలంటే ప్రజలు భయపడుతున్నారు. ఈ ప్రాంతంలో అనధికారికంగా బడ్డీ కొట్లు ఏర్పాటు చేసుకుని అక్కడ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుస్తున్నారని ఈ ప్రాంత ప్రజలు మండిపడుతున్నారు. నివాస ప్రాంతాలైన ఈ ప్రాంతంలో వాహనాల మరమ్మతుల కారణంగా రోడ్డుకు అడ్డదిడ్డంగా వాహనాలు పార్కింగ్ చేయడంతో పాటు మద్యం బాబుల గలాటా కారణంగా మహిళలు ఈ ప్రాంతం వైపు రావాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. మద్యం బాబులు మలమూత్ర విసర్జన కూడా అక్కడే చేయడంతో దుర్వాసన భరించలేక పోతున్నామని ఈ ప్రాంత ప్రజలు వాపోతున్నారు ఈ ప్రాంతంలో అనధికారికంగా ఏర్పాటు చేసిన బడ్డీ షాపులను తొలగించి మద్యం బాబులు ఇక్కడ మద్యం తాగకుండా చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత ప్రజలు జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ సెల్ లో సోమవారం ఫిర్యాదు సైతం చేశారు. ఇక్కడ వారిని అదుపు చేయకుంటే తాము కాపురాలు చేయలేమని వారు కలెక్టర్‌కు విన్నవించారు. జిల్లా కలెక్టర్‌కు వినతి ఇచ్చిన వారిలో లంక వెంకట శ్రీనివాసరావు, కె ఆదిత్యకుమార్, జనసేన నాయకులు సుంకర సురేష్, డేగల సురేష్ ఉన్నారు.

అనధికార నిర్మాణాలపై కలెక్టరుకు ఫిర్యాదు

కాకినాడ రూరల్: మండలంలోని తిమ్మాపురంలో అనధికార నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ సర్పంచ్ బెజవాడ వీరవెంకట సత్యనారాయణ జిల్లా కలెక్టర్ షణ్మోహన్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో గ్రామ పంచాయతీ తీర్మానంతో కూడిన ఫిర్యాదు పత్రాలను అందజేశారు. గ్రామంలో రాజీవ్‌గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పీజీ స్టడీస్ అనుమతులు లేకుండా అనధికార బహుళ అంతస్తుల భవనాలు, ఇతర నిర్మాణాలు చేపట్టి గ్రామ పంచాయతీకి చెల్లించవలసిన బిల్డింగ్ ఫీజు, పన్నులు కట్టకుండా రాజకీయ పలుకుబడితో నష్టం కలిగిస్తుందని, గడచిన 20 ఏళ్లలో సుమారు రూ.50 లక్షలు గ్రామ పంచాయతీ నష్టపోయిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. అచ్చంపేట జంక్షన్‌లో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ఫంక్షన్ హాలుపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సత్యనారాయణ సంతాప సభ



సత్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ తదితరులు

కరప: వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి కురసాల కన్నబాబు, సిసీ డైరెక్టర్ కల్యాణకృష్ణల తండ్రి కురసాల సత్యనారాయణ మరణించిన విషయం విదితమే. కాకినాడ రూరల్ నియోజకవర్గంలో జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, సత్తిబాబు దంపతుల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక చిరంజీవి కల్యాణ మండపంలో కురసాల సత్యనారాయణ సంతాప సభ జరిగింది. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కురసాల సత్యనారాయణ మరణంతో పెద్దదిక్కును కోల్పోయామని, ఆయన లేని లోటు తీర్చలేనిదని, ఆయన సేవలు చిరకాలం గుర్తుండిపోతాయని శ్లాఘిస్తూ పలువురు నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, జెడ్పీటీసీ సుబ్బారావు తదితర నాయకులు మాట్లాడుతూ పెద్దాయన మరణించారంటే జీర్ణించుకోలేక పోతున్నామన్నారు. ముందుగా కరప, కాకినాడ రూరల్ మండలాల నుంచి వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు కురసాల సత్యనారాయణ మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, కాకినాడ రూరల్ జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, వైఎస్సార్ సీపీ జిల్లా యాక్టివ్ కార్యదర్శి కమిడి శంకర్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి కరీం బాషా, మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి, గ్రామ కమిటీ అధ్యక్షుడు మేడిశెట్టి సత్తిబాబు, మండల యూత్ అధ్యక్షుడు పెంకే సత్తిబాబు, సర్పంచ్‌లు,, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలంటూ ధర్నా



జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

బోట్‌క్లబ్: తాళ్లరేవు మండలంలోని జాతీయ రహదారి 216 ప్రమాదాలకు నిలయంగా మారిందని, నిత్యం అనేక మంది ప్రజలు ఈ ప్రమాదాల్లో మరణిస్తున్నారని దీనిపై అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతూ తాళ్లరేవు మండల పరిసర ప్రాంతాల ప్రజలు సోమవారం జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ మధ్యకాలంలో జులై, ఆగస్టు నెలల్లో 10 రోడ్డు ప్రమాదాలు జరిగాయని సుమారు 20 మందికి పైగా మృత్యువాత పడ్డారని ఆందోళనకారులు వివరించారు. ఈ జాతీయ రహదారి పూర్తి స్థాయిలో నిర్మాణం కాకపోవడం, హైవే అథారిటీ వారు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు తీసుకోకపోవడం, యానాంలో మద్యం తాగి వాహనాలు నడపడం అనేక ప్రమాదాలకు కారణం అవుతూ ఎక్కువ మంది చనిపోతున్నారన్నారు. 216 జాతీయ రహదారి కాకినాడ నుంచి అమలాపురం వరకు పైలట్ ప్రాజెక్టు ప్రారంభించాలని, రేడియం సిగ్నల్స్‌ను ఏర్పాటు చేయాలని, పెట్రోలింగ్ నిరంతరం నిర్వహించాలని, బ్లాక్‌స్పాట్ బోర్డులను పెట్టాలని, 216 నేషనల్ హైవే 4 లేన్స్ విస్తరణ పని వెంటనే ప్రారంభించి డివైడర్ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం నేషనల్ హైవేలో యానాం పరిధిలో మద్యం షాపులను తొలగించాలన్నారు. ప్రమాదభరిత కూడలిలో సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టింగ్‌లను కఠినతరం చేయాలని, తాళ్లరేవు మండలంలోని పోలేకుర్రు వై జంక్షన్‌లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి జిల్లా పోలీసు కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేయాలని, వాహనాల స్పీడు నియంత్రణ రీడింగ్ మెషీన్లను ఏర్పాటు చేయాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తాళ్లరేవు మండల అఖిల పక్ష ప్రజా సంఘాల నాయకులు టి.ఈశ్వరరావు, అత్తిలి బాబూరావు, ఎస్.సత్యనారాయణ, కాశి లక్ష్మణస్వామి, వెంటపల్లి నూకరాజు, ఎం.రాజశేఖర్, నందికోళ్ల శ్రీమన్నారాయణ, బొంతు మోహన్, దొమ్మేటి శామ్యూల్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడాలి



బార్ అసోసియేషన్‌లో మట్టి గణపతి ప్రతిమను సుబ్రహ్మణ్యంకు అందజేస్తున్న సురేఖ



లయన్స్ హాల్లో పంపిణీ చేస్తున్న వినాయక మట్టి ప్రతిమలు



వినాయక మట్టి ప్రతిమలు పంపిణీ చేస్తున్న ఇండియన్ డెంటల్ అసోసియేషన్ సభ్యులు

కాకినాడ లీగల్: ప్రతి ఒక్కరూ మట్టి గణపతిని పూజిస్తూ పర్యావరణాన్ని పరిరక్షించాలని ధరిత్రి రక్షిత సమితి అధ్యక్షురాలు శీమకుర్తి సురేఖ పిలుపునిచ్చారు. కాకినాడ బార్ అసోసియేషన్‌లో కాలుష్య నియంత్రణ మండలి, ధరిత్రి రక్షిత సమితి సంయుక్త ఆధ్వర్యంలో బార్ అధ్యక్ష, కార్యదర్శులు ఏలూరి సుబ్రహ్మణ్యం, చెక్కపల్లి వీరభద్రరావు(చంటి), రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు నరహరిశెట్టి రవికృష్ణ తదితరులు సోమవారం న్యాయవాదులకు మట్టి గణపతి ప్రతిమలు అందించారు. వారు మాట్లాడుతూ గణపతి ఉత్సవాల్లో మట్టితో తయారు చేసిన ప్రతిమనే పూజించాలని చెప్పారు. కార్యక్రమంలో న్యాయవాదులకు మట్టి గణపతి ప్రతిమలు పంపిణీ చేశారు.

ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి

బాలాజీచెరువు: ప్లాస్టిక్ నిషేధంలో భాగంగా స్వచ్ఛందంగా ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని లయన్స్ జిల్లా పూర్వ గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ పేర్కొన్నారు. లయన్స్ హాల్లో వినాయక మట్టి ప్రతిమలు సోమవారం ఉచితంగా పంపిణీ చేశారు. బాలకృష్ణ మాట్లాడుతూ కాలుష్య నియంత్రణ మండలి, ధరిత్రి రక్షిత సమితి ఆధ్వర్యంలో నగరంలో ముఖ్య ప్రాంతాల్లో ఉచిత వినాయక మట్టి ప్రతిమలు, క్లాత్‌సంచులు, వ్రతకల్ప పుస్తకాలు పంపిణీ చేయడం సంతోషమన్నారు. రసాయనాలు కలుషితం కాకూడదని నగర వ్యాప్తంగా మట్టిప్రతిమలు పంపిణీకి ముందుకు రావడం ఆనందంగా ఉందని, వినాయక చవితిని అందరూ ఆనందంగా జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జగన్నాథరావు, పులవర్తి కుమార్, మురళీకృష్ణ, కృష్ణమోహన్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

బోట్‌క్లబ్: మట్టి గణపతిని పూజించి పర్యావరణాన్ని కాపాడాలని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అడ్డాల సత్యనారాయణ అన్నారు. వినాయక చవితి పండుగ సందర్భంగా స్థానిక నాగమల్లి తోట వద్ద ఉన్న సత్య డెంటల్ హాస్పిటల్‌లో అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ప్రజలకు మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. హిందూ సమాజంలో ప్రకృతిలోని పంచభూతాలు, జీవరాశులను ఆరాధించడం ఒక ముఖ్యమైన సంప్రదాయమన్నారు. పండుగలు, ఉత్సవాల సమయంలో శబ్ద, వాయు, జల కాలుష్యాలు పెరిగి పర్యావరణానికి హాని కలుగుతుందన్నారు. పట్టణాల్లో ప్రారంభమైన ఈ అలవాటు, పచ్చని గ్రామాల్లోకి కూడా వ్యాపించి, గ్రామాలను కాలుష్య కేంద్రాలుగా మారుస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు శ్రీవల్లి, మాధురి, అనిల్ ప్రజలు పాల్గొన్నారు.

భూ కబ్జాదారుల నుంచి రక్షణ కల్పించండి

కాకినాడ రూరల్: కూటమి భూ కబ్జాదారుల నుంచి తమకు రక్షణ కల్పించాలని సర్పవరం గ్రామానికి చెందిన నిమ్మన నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు. గ్రామంలోని నేరేళ్లమ్మ గుడి వీధిలోని సర్వే నంబర్ 6/4లో ఉన్న భూమిలో సుమారు 60 ఏళ్ళుగా సాగు, నివాసం ఉంటున్నామని, ఇప్పుడు భూ కబ్జాదారులు కొంత మంది రౌడీలను తీసుకువచ్చి తమపై దాడికి ప్రయత్నిస్తున్నారని నాగేశ్వరరావు తెలియజేశారు. సోమవారం స్థలం ఆక్రమించుకునేందుకు ప్రయత్నించగా దాడి చేస్తున్నారని, కోర్టులో కేసు ఉండడంతో పోలీసులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు.

ఊపందుకున్న వ్యవసాయ పనులు



పెదశంకర్లపూడిలో నాట్లు వేస్తున్న కూలీలు

ప్రత్తిపాడు: ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. పంట సాగుకు దుక్కులు దున్ని పొలాలు సిద్ధం చేసుకున్న రైతులు ఇటీవల కాలం వరకు వరుణుడి కరుణ కోసం ఎదురు చూశారు. అల్పపీడనాల ప్రభావంతో మూడు రోజులు విస్తారంగా వర్షాలు కురిసి, రైతును మురిపించాయి. పొలాల్లో నీరు చేరడంతో ట్రాక్టర్లతో దమ్ము చేసి వరి నాట్లు వేయడం ప్రారంభించారు. రెండు వేల ఎకరాల్లో ఖరీఫ్‌కు బదులుగా సరుగుడు వైపు రైతాంగం మళ్లింది.

ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు ఉపందుకోవడంతో రైతులు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. మండలంలోని వాకపల్లి, చింతలూరు, వెంకటనగరం, పోతులూరు, గోకవరం, పెదశంకర్లపూడి, చినశంకర్లపూడి, పెద్దిపాలెం, శరభవరం, గజ్జనపూడి తదితర గ్రామాల్లోని రైతులు వరి నాట్ల పనిలో బిజిబిజీగా ఉన్నారు. ఇప్పటికే ప్రత్తిపాడు, లంపకలోవ, ఏలూరు, టి రాయవరం తదితర గ్రామాల్లో వరి నాట్లు దాదాపు పూర్తి కావస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలకు పంట ముంపులో ఉంటే మడుల్లో నీటిని బయటకు పంపి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి జోకా అమృత సూచించారు. ప్రస్తుతం 20 కేజీల యూరియా, 10 కేజీల పొటాష్ వేయాలన్నారు. తెగుళ్ల నివారణకు లీటరు నీటికి 2గ్రాములు కార్బోడోజెమ్‌ను ఎకరానికి 250 గ్రాముల మందును పిచికారీ చేయాలని ఆమె తెలిపారు.

వేతనాలు చెల్లించాలంటూ కార్మికుల వినతి

బోట్‌క్లబ్: గ్రామ పంచాయతీ కార్మికులకు చెల్లించాల్సిన వేతనాలు వెంటనే చెల్లించాలంటూ ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు సీహెచ్ అజయ్ కుమార్, టి.రాజా, యేసులు సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. కాకినాడ రూరల్ మండలంలో ఇంద్రపాలెం పంచాయతీలో జూన్, జులై వేతనాలు, పాత ఏరియర్స్ బకాయిలు, రమణయ్యపేట, వాకలపూడి పంచాయతీల్లో జులై నెల వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. స్వచ్ఛతా ర్యాలీలో పారిశుధ్య కార్మికులు చేస్తున్న సేవలను ప్రశంసించిన ముఖ్యమంత్రి వీరికి సరిపడే జీతాలు, ప్రభుత్వ సెలవులు, వారి ఆరోగ్యం, ఇతర కార్మిక చట్టాలు అమలు చేసే విధంగా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకోవాలని యూనియన్ నాయకులు విజ్ఞప్తి చేశారు. కనీస వేతనం, పీఎఫ్, ఈఎస్ఐలు అమలు చేయాలని, ప్రమాద బీమా రూ.10 లక్షల చెల్లించాలని, దహన సంస్కారాలకు రూ.20 వేలు పెంచాలని, ప్రభుత్వం ఇచ్చిన జీవోలు అమలు చేయని అధికారులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో సత్యనారాయణ, ఏసు, భద్రం, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కుళ్లిన మాంసాహార విక్రయాలపై చర్యలు తీసుకోవాలి

కరప: పంచాయతీకానీ, ఇతర అధికారుల అనుమతి లేకుండా గ్రామంలో కుళ్లిన చేపలు, మాంసం విక్రయాలు జరుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని గొర్రిపూడి గ్రామస్తులు సోమవారం తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల్లోను, పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గొర్రిపూడి గ్రామపంచాయతీ పరిధిలో వివిధ వ్యాపారాలు నిర్వహించుకునేందుకు గాంధీమార్కెట్‌ను ఏర్పాటు చేశారు. మార్కెట్‌లో కాకుండా కొంతమంది గ్రామంలోని రోడ్లపైన, నివాస ప్రాంతాల్లోను, రైసుమిల్లు సమీపంలోనూ చేపలు, మాంసం దుకాణాలు ఏర్పాటు చేసుకుని, ఎవరి అనుమతులు తీసుకోకుండా చనిపోయిన చేపలు, పాడైన మాంసం అమ్మకాలు జరుపుతున్నారని, వీటివల్ల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని, ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా కుళ్లిన, పాడైన చేపలు, మాంసం అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకోవాలని, మార్కెట్‌లోనే అమ్మకాలు జరిగేలా చూడాలని గ్రామస్తుల నుంచి 300 వరకు సంతకాలు సేకరించి ఫిర్యాదు చేశారు.